ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.32 | సహర్: 5.00 (మంగళవారం)
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
సోమవారం 18 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 | కనిష్ఠం 24.4



ఎదుర్కోలు మహోత్సవం

కల్యాణానికి సిద్ధమైన వేదిక

కల్యాణానికి వేళాయే..

- నేడు నృసింహుడి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- 'జగన్మోహినీ'గా దర్శనమిచ్చిన నృసింహుడు
- రాత్రి నేత్రపర్వంగా ఎదుర్కోలు మహోత్సవం

సకల జనవాళిపై కోటి సూర్యకాంతులు వెదజల్లుతూ.. తన కరుణా కటాక్షాలతో వెలుగులు విరాజిల్లే ఏకశిఖర వాసుడు.. యాదాచాల నృసింహుడితో.. సర్వజనులకు సిరి సంపదలు.. సుఖసంతోషాలు ప్రసాదించే శ్రీమహాలక్ష్మి అమ్మవారితో ముక్కోటి దేవతల సాక్షిగా నిర్వహించే కల్యాణ ఘుడియలు దగ్గరపడ్డాయి. సోమవారం రాత్రి తులా లగ్నంలో 8.45 గంటలకు ప్రధానాలయ తూర్పు దిశలోని బ్రహ్మోత్సవ మండపంపై కల్యాణ తంతు నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించారు. ఆదివారం ఉదయం స్వామివారు జగన్మోహినీ అలంకారంలో భక్తులను తన్మయపరిచారు. బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం రాత్రి ప్రధానాలయ తూర్పు తిరుమాఢ వీధిలో నేత్రపర్వంగా కొనసాగింది.

- యాదగిరిగుట్ట

• 7లో...

అంతంత మాత్రంగానే కాసిన కాయలు

మామిడి తోటలో రాలిపోతున్న పూత



ప్రతికూల వాతావరణంతో మామిడీలా

- రాలిపోతున్న పూత, పిందెలు
- తెగుళ్లబారిన పడుతున్న మామిడి తోటలు

ఓవైపు సరిపడా వర్షాలు లేవు. మరోవైపు తెగుళ్లు మామిడి రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణం కూడా అనుకూలించకపోవడంతో మొదటిలోనే పూత రాలిపోతోంది. దీంతో మామిడి చెట్లపై 40 నుంచి 50 శాతం మాత్రమే పూత మిగిలింది. దిగుబడుల కోసం రైతులు ఎకరాకు రూ.20వేల వరకు వెచ్చిస్తున్నారు. అయినా కూడా ఫలితం లేకుండా పోతోంది.

● నల్లగొండ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మామిడి తోటల రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. మరికొన్ని రోజుల్లో మామిడి సీజన్ ప్రారంభంకానుండగా కాయ దిగుబడిపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణం అనుకూలించక పూత రాకపోవడం, ఆపై వచ్చిన పూత రాలిపోవడం, లేదంటే పిందె స్థాయిలోనూ నిలబడకపోవడంతో దిగుబడి పడిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే పూత దశలో 40 నుంచి 50శాతం మాత్రమే మిగులుతోంది. గత కొన్నిరోజుల వరకు మంచు కురవడంతోపాటు కోడిపేను వంటి తెగుళ్ల బారిన మామిడి పడటంతో పూత రాలిపోయింది. పిందె లేకపోవడంతో కాయ తక్కువగా కనిపిస్తుంది. గత ఏడాది వర్షకాలం సైతం వానలు సరిగ్గా కురవపోవడంతో ఆ ప్రభావం తోటలపై తీవ్రంగానే ఉంది.

చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

● ప్రస్తుతం మామిడి తోటలు సగభాగం పచ్చపూత, ఇంకొంత భాగం తెల్ల పూత, మరికొంత భాగం ఇంకా మొట్టెలతోటి (మొగ్గ దశలో) పూత విచ్చుకోకుండా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తోటలకు తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.

● చెట్టుకు తెల్ల, పచ్చ పూతకంటే మొట్టెలే (పువ్వు మొగ్గలు) అధికంగా ఉంటే మల్టీ-కే (13-0-45) 5 కిలోలు+సూక్ష్మ పోషక మిశ్రమం 2.5 కిలోలు+ ప్లానోఫిక్స్ 100 మి.లీ/500 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● పచ్చపూత దశలో తేనె మంచు నివారణకు థయోమి తాక్సమ్ 200 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 80శాతం డబ్ల్యూ 150 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 100 మిల్లీ లీటర్లు, బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 1లీ.+ వేపనూనె 2 లీటర్లు.. 500 లీటర్ల నీటిలో (ఒక డ్రమ్) కలిపి పిచికారీ చేసుకోవాలి.

● పూత విచ్చుకున్నాక 10-15 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయరాదు.

● తెల్లపూత చాలా సున్నితమైన దశ కాబట్టి తేనె మంచు పురుగు, బూడిద తెగులు, పిండినల్లిని వీలైనంత వరకు పచ్చపూత దశలోనే నివారించుకోవాలి.

● ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలలో తప్పనిసరిగా యూరియా, పొటాష్, బోరాన్ ఎరువులు చల్లాలి. ఎరువులు ఎప్పుడైనా ఒకేసారి వేసేకంటే పలు దఫాలుగా వేసుకోవడం వల్ల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పూత నుంచి పిందెలు ఏర్పడి బఠానీ గింజ సైజులో ఉన్నప్పుడు పదేళ్ల పైబడిన ప్రతీ చెట్టుకు, డీఏపీ-700 గ్రాములు, యూరియా 400 గ్రాములు, ఎంఓపీ 600 గ్రామల చొప్పున ప్రతీ చెట్టుకి వేసి నీరు పెట్టాలి.

● బఠానీ గింజ సైజులో ఉండి పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే మల్టీకే (13-0-45) 2.5 కిలోలు + సూక్ష్మ పోషక మిశ్రమం (ఫార్ములా-4) 2.5 కిలోలు + ప్లానోఫిక్స్ 100 ఎంఎల్‌లను 500 లీటర్ల నీటికి కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేసుకోవాలి.

● పండు ఈగ నివారణకు లింగాకర్షణ బుట్టలను (మిథైల్ యూజినాల్) ఎకరానికి 10 నుంచి 25 ఏర్పాటు చేసి ప్రతీ 20 రోజులకు ల్యూర్‌ను మారుస్తూ పంట పూర్తయ్యే వరకు కొనసాగించాలి.

● లాన్సర్ గోల్డ్ రెండు గ్రాములు, ఇండెక్స్ రెండు గ్రాములు, వేపనూనె 5మి.లీల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలినేటర్స్ సంచార సమయంలో పిచికారీ చేయవద్దు.



ఉమ్మడి జిల్లాలో 26వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మామిడి తోటలు 26,014.98 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 11,968.78 ఎకరాల్లో మామిడి విస్తీర్ణం ఉండగా, సూర్యాపేట జిల్లాలో 11,886.20ఎకరాల్లో విస్తీర్ణం ఉంది. నల్లగొండ జిల్లాలో 2,160 ఎకరాల్లో మాత్రమే మామిడి తోటలు ఉన్నాయి. మామిడిపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. జనవరి, ఫిబ్రవరిలో చలి ఉండటంతో మంచువల్ల తోటలు తెగుళ్ల బారినపడ్డాయి. మంచుకు తోడు కోడిపేను, బూడిద తెగుళ్ల మామిడి తోటకు నష్టం చేస్తున్నాయి. రైతులు ఒక్కో ఎకరానికి రూ.20వేల వరకు సస్యరక్షణ చర్యలకోసం ఖర్చు చేస్తున్నారు. పురుగు మందులు అధికంగా వాడటంవల్ల ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం దిగుబడి మూడోవంతుకు పడిపోయే ప్రమాదం ఉందని, పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో రావో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిందె రాలిపోవడానికి కారణాలివే..

పిందె, పూత రాలిపోవడానికి నీరు, పోషకలోపమే కారణం. డ్రిప్ పైపులు అమర్చే పద్ధతి కూడా ఉత్పత్తిపై ప్రభావం చూపిస్తుంది. మధ్యాహ్నం ఎండలు ఎక్కువగా ఉండటంవల్ల పూత పిందెపై ప్రభావం చూపిస్తుంది. నీటి తడులు ఇచ్చేటప్పుడు మొదటి రెండు తడులు తేలికగా ఇచ్చిన తర్వాత మాత్రమే మూడోతడి పూర్తిగా ఇవ్వాల్సి వస్తుంది. లేదంటే పూత గాని, పిందే గాని రాలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుంది.



చెట్లకు నీటిని సమృద్ధిగా పెట్టాలి

వేసవి తీవ్రత దృష్ట్యా మామిడి చెట్లకు నీటిని సమృద్ధిగా అందించాలి. పిందె రాలిపోకుండా ఉండటానికి యాజమాన్య పద్ధతులను అవలంబించాలి. మంచు సమయంలో పిందె చాలావరకు రాలిపోయింది. పంట దిగుబడులను కాపాడుకోవడానికి రైతులు చెట్లకు నీరు పెట్టాలి. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ, మామిడి తోటలను కాపాడుకొని అధిక దిగుబడులు సాధించాలి.

అనంతరెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 12,133 మంది విద్యార్థులు
- పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల వరకు అనుమతి



ఓ పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు కేటాయిస్తున్న సిబ్బంది

సూర్యాపేట అర్బన్, మార్చి 17: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రతీ రోజు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 26వ తేదీన సైన్స్ పార్ట్-1(భౌతికరసాయనశాస్త్రం), 28వతేదీన సైన్ పార్ట్-2(జీవశాస్త్రం) పరీక్షలను మాత్రం ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహించనున్నారు. అదేవిధంగా వచ్చే నెల 1వ తేదీన జరిగే ఒకేషనల్ కోర్సు(థియరీ) పరీక్షను ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు నిర్వహిస్తారు.జిల్లాలో మొత్తం 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా, 12,133 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అందులో మొత్తం 11,946 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా, 187మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. 20మందికి ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు. 67 పరీక్షా కేంద్రాలకు 67మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ (డీవో), 51 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్, నలుగురు రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు ఫ్యాన్లు, లైట్లు ఇతర సౌకర్యాలు కల్పించారు.

5నిమిషాల వరకు అనుమతి

విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. పరీక్ష ఉదయం 9.30కు ప్రారంభం కానుండగా, ఉదయం 9.35గంటల వరకు పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతిస్తారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేయడంతోపాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో ఆయా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసేలా కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. పరీక్ష విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా ఐడెంటీ కార్డును ధరించాలి. విద్యార్థులతో పాటు సిబ్బంది పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకూడదు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఉంటే సెల్ నంబర్ 9848809754 లో సంప్రదించాలని డీఈవో కోరారు.

విద్యార్థులు ఇవి పాటించాలి..

- విద్యార్థులువారికి కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ఒక్క రోజు ముందే వెళ్లి చూసుకోవాలి.
- పరీక్ష కేంద్రానికి గంట ముందు అంటే ఉదయం 8.30గంటలలోపు చేరుకోవాలి.
- విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్, ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్‌ను తీసుకుని వెళ్లాలి.
- విద్యార్థులు తమకు ఇచ్చిన ప్రశ్నాపత్రం సరైనదా లేదా అని చూసుకోవాలి.

విద్యార్థులు చేయకూడనివి..

- విద్యార్థులు స్కూల్ యూనిఫాం ధరించి పరీక్ష కేంద్రానికి హాజరు కాకూడదు.
- డిజిటల్ చేతి గడియారాలు, సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకూడదు.
- హాల్‌టికెట్ నంబర్‌ను మెయిన్ ఆన్సర్‌షీట్, అడిషనల్ ఆన్సర్ షీట్, గ్రాఫ్, మ్యాపు, బిట్ పేపర్లతో సహా ఎక్కడా రాయకూడదు.
- విద్యార్థులు వారి పేరు, సంతకం, ఏ విధమైన గుర్తింపు చిహ్నాలు, స్లోగన్లు ఆన్సర్ షీట్‌లో రాయకూడదు.
- పరీక్ష సమయం పూర్తయ్యే వరకు విద్యార్థులు కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు.

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సూర్యాపేటటౌన్, మార్చి 17: కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బీసీలను భాగస్వాములను చేసేలా సముచిత స్థానం కల్పించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు రాజకీయంగా బీసీలకు వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీలకు 60సీట్లు కేటాయించకుండా అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని ఆరోపించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలను విస్మరించి 17 స్థానాల్లో సరైన న్యాయం చేయలేదన్నారు. ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్లలో సైతం బీసీలకు మొండిచేయి చూపుతు కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు అన్యాయం చేసిందన్నారు. కనీసం కేబినేట్ హోదాకు సైతం బీసీలు అర్హులు కాదా అని ప్రశ్నించారు. బీసీల జోలికొస్తే ఆగం కాక తప్పదని, బీఆర్ఎస్ పార్టీ ఓటమే దీనికి నిదర్శనమన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పిస్తే పదేళ్ల పాలనలో ఉంటారని లేదంటే 10నెలల పాలన కూడా ఉండదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ, సంపత్‌నాయుడు, భూపతి నారాయణ, వెంకన్న, మట్ట రమేష్‌యాదవ్, భాస్కర్, నర్సింహ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమాచార హక్కు చట్టం

సమాచార హక్కుచట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

సూర్యాపేటఅర్బన్, మార్చి 17: సమాచార హక్కు చట్టం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కుచట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని త్రివేణి డిగ్రీకళాశాలలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశభవిష్యత్ నిర్ణయించే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చారిత్రాత్మక అవసరమని అన్నారు. కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు 16 కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీర్ఘకాలిక నిర్ణయాలు అమలు చేయడంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కన్నకలలు నిజం కావాలంటే ఆర్టీఏ చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేధావులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఏకతాటిపై వచ్చి ప్రజాస్వామ్యంలో ఓటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమాచారహక్కు చట్టం వచ్చాక సామాన్యులకు గౌరవం పెరిగిందన్నారు. గతంలో అధికారులు సామాన్యులను పరిగణలోకి తీసుకునే వారు కాదని తెలిపారు. ఆర్టీఏ చట్టం అమలులోకి వచ్చాక ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం అధికారులకు ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి, గుంటకండ్ల ముకుందారెడ్డి, ఉన్నం సత్యనారాయణ, చీకూరి శివకుమార్, కిన్నెర ఉపేందర్, దండ వెంకట్‌రెడ్డి, రామూర్తి, సూర్యం, కొండగడుపుల సూరయ్య, వెంకట్‌రెడ్డి, ఆనంద్, భిక్షంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమాచార హక్కుచట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

పర్యటకరంగ అభివృద్ధికి కృషి చేస్తా

పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి



పటేల్ రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 17: జిల్లా పర్యటక రంగ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురు నాయకులు, ప్రముఖులు ఆదివారం కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తనపై నమ్మకంతో పదవి ఇచ్చిందని, శక్తివంచన లేకుండా పనిచేసి ప్రభుత్వ గౌరవాన్ని కాపాడుతానన్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి దేవాలయం, ఉండ్రుగొండ, నాగులపాడు, సద్దుల చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కాంగ్రెస్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో ఇప్పటికే విజయవంతమైందన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డిరాజా,గోదాల రంగారెడ్డి, ముదిరెడ్డి రమణారెడ్డి, శ్రీనివాస్, కౌన్సిలర్‌లు షఫీఉల్లా, ఎడ్ల గంగాభవాని వీరమల్లుయాదవ్,స్వామినాయుడు, రమేష్‌నాయుడు, దేవేందర్, వెంకన్న, సంజయ్, ధర్మపాల్గొన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

సూర్యాపేట(కలెక్టరేట్) మార్చి 17: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడికి తీవ్రగాయాలు

పెన్‌పహాడ్, మార్చి 17: రోడ్డు ప్రమాదంలో ఓ దివ్యాంగుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెన్‌పహాడ్ ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దూపహాడ్ గ్రామానికి చెందిన కొప్పోజు గోపాచారి పుట్టుకతోనే దివ్యాంగుడు. శనివారం రాత్రి దుపహాడ్ గ్రామంలో గోపచారి కిరాణం దుకాణానికి వెళ్లి, ఇంటికి రావడానికి రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి నుంచి సూర్యాపేటకు కోళ్ల దాణా లోడుతో వెళుతున్న టీఎస్25టీ3179 నెంబరు గల లారీ అతి వేగంగా వస్తూ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ముందు టైర్లు గోపచారి కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితిని గమనించి డ్రైవర్ లారీని ఘటనా స్థలంలోనే వదిలిపెట్టి పరారయ్యాడు. గ్రామస్థుల సాయంతో కుటుంబ సభ్యులు 108అంబులెన్సులో గోపాచారిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గోపాచారి దంపతులకు కుమార్తె ఉంది. భార్య శ్రీహర్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

తిరుమలగిరి రూరల్, ఆత్మకూర్(ఎస్), మద్దిరాల, మార్చి 17: సూర్యాపేట జిల్లాలో తాటిచెట్లపై పైనుంచి పడి ఓగీత కార్మికుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుమలగిరిఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్(41) ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నగౌడ్ దంపతులకు కుమార్తె ఉంది. వెంకన్నగౌడ్ మృతదేహానికి తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుమార్తెకు నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

వెంకన్నగౌడ్ కుమార్తె పదో తరగతి చదువుతోంది. సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో తండ్రి అకాల మృతి చెందడంతో ఆకుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబ దిక్కుతోచని స్థితిలో ఉందని ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని గుండెపురి గ్రామానికి చెందిన పలువురు కోరారు.

మరో ఇద్దరికి గాయాలు

● ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో ఆత్మకూర్(ఎస్)మద్దిరాల మండలాల్లో గీత కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు యరగాని వెంకన్న కల్లు గీయడానికి శనివారం రాత్రి తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంకన్నను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

● మద్దిరాల మండలంలోని పోలుమళ్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు మమూనూరి శ్రీను గ్రామ శివారులో కల్లు గీయడానికి ఆదివారం తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడిన శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనును 108అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

హుజూర్‌నగర్, మార్చి 17: కుటుంబంలో జరిగిన ఘటనలకు మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన పంగ సైదులు(48)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో చిన్న కుమారుడు మృతి చెందాగా, భార్య మూడేళ్ల క్రితం చనిపోయింది. దీంతో సైదులు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయం మద్యం తాగి గ్రామశివారులో ఉన్న మామిడి తోటలోకి వెళ్లి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు.

వెంటనే బంధువులు సైదులును హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సైదులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సైదులు పెద్దకుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.













అవయవదానం

రాజాపేట, మార్చి 17: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మ యాదగిరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన తల్లిదండ్రులు ఆదివారం అవయవదానం చేశారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మ కొమురయ్య విజయ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఎమ్మ యాదగిరి(20) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి వచ్చి వెళ్తుండగా యాదగిరిగుట్ట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. యాదగిరి కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని జీవన్‌దాన్ సంస్థ నిర్వాహకులు యాదగిరి తల్లిదండ్రులను అవయవదానం కోసం అవగాహన కల్పించారు. యాదగిరి తల్లిదండ్రులు కుమారుడి అవయవాలను అవయవదానం చేసేందుకు ఒప్పుకున్నారు. దీంతో గుండె, కిడ్నీలు, కాలేయం, కంటి పొరలను ట్రస్ట్ సభ్యులు సేకరించారు.

'జగన్మోహినీ'గా దర్శనమిచ్చిన నృసింహుడు

యాదగిరికొండపై బ్రహ్మోత్సవ శోభతో



ఆలయ తిరువీధుల్లో అలంకారసేవ ఊరేగింపు, పాల్గొన్న భక్తులు



యాదగిరిగుట్ట, మార్చి17: జగద్రక్షుడు.. స్వయంభు పాంచనారసింహుడు.. యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవ విశేష ఘట్టాలతో యాదాచల దివ్యక్షేత్రం ఆదివారం మహోత్సవ శోభను సంతరించుకుంది. వేద పండితులు, అర్చకబృందం, రుత్వికుల వేద పారాయణాలు, హోమ పూజలు, అలంకార సేవలతో పాటు ఆధ్యాత్మికత సందడి నెలకొంది. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోలు జరిగే రోజున స్వామివారు జగన్మోహినీ అలంకారంలో భక్తులను తన్మయ పరిచారు. సర్వజగత్తులోని సకల జీవరాశిని తనవైపు ఆకర్షించడానికి.. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణకు అవతార పురుషుడు లక్ష్మీనృసింహుడు 'జగన్మోహిని' దివ్య సుందరరూపంలో అలరింపజేశారు. పట్టుపీతాంబరాలు, బంగారు, వజ్ర, ముత్యాలను పొదిగిన దివ్యాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ముగ్ధమనోహర జగన్మోహిని అలంకార మూర్తుల సేవ ముందు పారాయణీకులు, పండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛరణలు, మూలమంత్ర జపస్తోత్ర పఠనాలు జరపగా.. ఆస్థాన విద్వాంసులు మంగళ వాయిద్యాలు మోగిస్తుండగా భక్త జనులు గోవింద నామ స్మరణ నడుమ ఆలయ తిరువీధుల్లో అలంకార సేవ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ప్రధానాలయ తూర్పు రాజగోపురం ముందు అలంకారసేవకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'స్వామివారే పరమాత్మ' ప్రజలందరూ జీవాత్మలు అనే భగద్గీతలోని సారానికి అనుగుణంగా నారసింహుడిని జగన్మోహిని దివ్యాలంకరణలో దర్శించుకున్న భక్తులు ఆనంద పరవశం చెందారు. ఈ వైదిక కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

యాగశాలలో హవన పూజలు

యాదగిరికొండపై అంగరంగ వైభవంగా జరుగుతున్న లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ఉదయం, సాయంత్రం ప్రధానాలయ యాగశాలలో హోమ పూజలు నిర్వహించారు. మండపంలో రుత్వికులు మూలమంత్ర జపాలు, వేద పారాయణాలు చేస్తూ యాగం నిర్వహించారు.

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ప్రభాతభేరి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతబేరి వైదిక పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రభాతవేళ వేదపారాయణాలతో స్థానిక శ్రీవైష్ణవస్వాములు, రుత్వికులు స్వామిని కొలుస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం.

స్వామివారికి టీటీడీ మేల్చాట్ పట్టువస్త్రాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున ఆదివారం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడికి వార్షిక బ్రహ్మోత్సవాల్లో కల్యాణ పట్టువస్త్రాలు(మేల్చాట్) ఉప కార్యనిర్వహణాధికారి లోకనాథం,పర్యవేక్షకులు సురేష్, అర్చకులు మురళిలు సంప్రదాయరీతిలో అందజేశారు. ముందుగా టీటీడీ అధికారులు, అర్చకస్వాములు బ్రహ్మోత్సవ కల్యాణ పట్టువస్త్రాలను తీసుకుని ప్రధానాయలం చుట్టూ ప్రదక్షిణచేసి ముఖమండపంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావుకు అందజేశారు. ముందుగా స్వామివారిని జగన్మోహినీ అలంకారసేవలో టీటీడీ బృందం పాల్గొంది.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ అధికారులు

కొండపై యాత్రాజనుల సందడి



యాదగిరిక్షేత్రంలో ఆదివారం యాత్రాజనుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు, దేవదేవుడి బ్రహ్మోత్సవాలు కొనసాగుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తజనులు పెద్ద సంఖ్యలో ఇష్టదైవాల దర్శనాల కోసం తరలివచ్చారు. కొండపైన ఆలయ తిరువీధులు, ప్రసాదాల విక్రయశాల, దర్శన క్యూలైన్లు, కొండకింద పట్టణ ప్రధానవీధులు, ఘాట్‌రోడ్ ప్రాంతాలు భక్తులతో కోలాహలంగా కనిపించాయి. స్వామివారి ధర్మదర్శనాలకు 3గంటల సమయం, ప్రత్యేక దర్శనాలకు 1గంట సమయం పట్టినట్టు, సుమారు 30వేలకు పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించినట్టు, ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.42,59,584 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామికి నిత్యారాధనలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్ఠా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.



ఆలయం వద్ద నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ ఈవో, ఉద్యోగులు, అర్చకులు

ఏకశిఖరవాసుడి సన్నిధిలో

నేడు బ్రహ్మోత్సవ తిరుకల్యాణం

» ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు » ఘనంగా ఎదుర్కోలు మహోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 17: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టం తిరుకల్యాణాన్ని దేవస్థాన అర్చక,రుత్విక, వేదపండితుల బృందం సోమవారం రాత్రి 8.45గంటలకు సంప్రదాయరీతిలో ఆరంభించనున్నారు. ముందుగా స్వామివారిని గజవాహనసేవలో, అమ్మవారిని పుష్పామాలంకృత పల్లకి సేవలో తీర్చిదిద్ది ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. యాదగిరికొండపై అఖిలాండ బ్రహ్మాండకోటి నాయకుడు లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక ముందు ప్రాంగణంలో బారికేడ్లతో గ్యాలరీలను నిర్మిస్తున్నారు. మీడియా, వీవీఐపీలు, దేవస్థాన సిబ్బందితో పాటు స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణ టికెట్లు కొనుగోలు చేసిన భక్తుల కోసం వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఈ గ్యాలరీలో సుమారు 3,500మంది పట్టేలా ధంగా ఏర్పాట్లు చేశారు. ఎనిమిది ఎల్ఈడీ టీవీల్లో నాలుగు కల్యాణ వేదిక ప్రాంతంలో, ఒకటి తూర్పు రాజగోపురం ముందు, ఒకటి దర్శన క్యూకాంప్లెక్స్ ముందు, రెండు కొండపైన బస్టాండ్ ప్రాంతంలో అమర్చనున్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసే భక్తులకు సరిపడా ప్రసాదాలను సిద్ధం చేశారు. కొండకింద ఉచిత అన్నదాన భవనంలో అన్నప్రసాదాల వితరణ చేయనున్నారు. సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, తిరుకల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా సీఎంతో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారికంగా వచ్చే అవకాశాలు లేవు.



ఎదుర్కోటు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ఎదుర్కోలు మహోత్సవం

నృసింహుడి బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం ఆదివారం రాత్రి ప్రధానాలయ తూర్పు తిరుమాడ వీధిలో నేత్రపర్వంగా కొనసాగింది. దివ్యాలంకార శోభితుడైన నృసింహుడిని అశ్వవాహనంపై అధిరోహించి, పల్లకి సేవలో మహాలక్ష్మీ అమ్మవారిని అలంకరించిన ఆచార్యులు ఆలయ తిరువీధుల్లో ఊరేగింపుగా తూర్పు పంచతల రాజగోపురం వద్దకు తీసుకువచ్చి ఎదుర్కోలు నిర్వహించారు.

పంటకు నిప్పు

» ఆరుగాలం శ్రమ వృథా » పంట నష్టపోయిన అన్నదాతలు
» నల్లగొండ జిల్లా మిర్యాలగూడ యాద్గార్‌పల్లిలో ఘటన

మిర్యాలగూడరూరల్, మార్చి 17: పంటలు ఎండి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండుతుండగా, వాటికి నీరందించలేక, ఎండిన పంటను కాపాడుకోలేక అన్నదాతలు పైరుకు నిప్పంటించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని మిర్యాలగూడ మండలంలో బోర్లు బావుల కింద రైతులు వరిసాగు చేశారు. చివరి దశలో ఒక్క తడి నీరందిస్తే చేతికొచ్చే పంట నిలువునా ఎండుతుండటంతో ఆవేదన చెందిన రైతులు మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఆదివారం వరి పంటకు నిప్పటించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన చిన్నకారు రైతులు మల్లెబోయిన సైదులు ఐదు ఎకరాలు, బంటు లక్ష్మయ్య నాలుగు ఎకరాలు, తిప్పన ప్రతాప్ మూడు ఎకరాలు బోరు బావుల కింద సాగు చేశారు. కానీ సాగర్ నీరందక బోరు బావులు వట్టిపోతుండటంతో సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో ఆవేదన చెంది పంటకు నిప్పటించారు. ప్రభుత్వం వారబందీ విధానంలో సాగునీరు అందిస్తుందన్న ఆశతో పాటు బోర్లను నమ్ముకొని సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



యాద్గార్‌పల్లిలోఎండిపోయిన పంటను తగులబెడుతున్న రైతు సైదులు

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

చౌటుప్పల్ రూరల్ మార్చి 17: రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన మోసానికి అనేక మంది ప్రజలు రోడ్డునపడ్డారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఆదివారం వెంచర్ వద్ద ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులోని సర్వే నెంబర్ 21, 23, 33లలో 2000 సంవత్సరంలో 40 ఎకరాల్లో గ్రీన్ స్టార్ హౌసింగ్ ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ పేరిట డెవలప్‌మెంట్ వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు హైదరాబాద్‌కు చెందిన అనేక మంది మధ్యతరగతి ప్రజలు వాయిదాల పద్ధతిలో ప్లాట్లు కొనుగోలు చేశారు. ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు కూడా జరిగాయి. పట్టాదారు, వెంచర్ యజమానుల మధ్యన విభేదాలు ప్లాట్ల యజమానులకు శాపంగా మారాయి. తాము భూమి అమ్మలేదని పట్టాదారుడు ఇటీవల ప్లాట్లను స్వాధీనం చేసుకొని 12 ఎకరాల చుట్టు ప్రహరీ నిర్మించాడు. వెంచర్‌లోకి వెళ్లగానే కాపాలాదారులు కుక్కలను వదులుతున్నారని, పోలీసులతో బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన మోసానికి తాము బలయ్యామని బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఎవరికి ఫిర్యాదు చేసిన న్యాయం జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.



తూప్రాన్‌పేటలో ఆందోళన చేస్తున్న భాదితులు

లారీ బోల్తా... డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నర్సంపేట టౌన్, మార్చి 17 : ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తాపడగా లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపు వస్తున్న లారీ నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామ శివారులోకి రాగానే, ఎదురుగా వచ్చిన స్కూటీని తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవర్ నల్గొండ జిల్లా దామెరకొండ గ్రామానికి చెందిన బిజిలి గంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గంగయ్యను చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



బోల్తా పడిన లారీ

రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

వేములపల్లి, మిర్యాలగూడ రూరల్, మార్చి 17: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోని పలు రైస్ మిల్లులను ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ ప్రారంభంలో ధాన్యాన్ని రూ.2,700కు పైగా కొనుగోలు చేసి పంట నూర్పిడి పుంజుకోగానే ఒక్కసారిగా ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. రైతులు ధాన్యం తీసుకొని వచ్చినప్పుడు మిల్లు గేట్లు తెరవకుండా బయటనే ఉంచి గుమాస్తాలు అసభ్య పదజాలం వాడటం సరికాదన్నారు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా ఆయకట్టు పరిధిలోని ధాన్యాన్ని రూ.2500కు తగ్గకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను కోరారు. నాణ్యమైన ధాన్యానికి గరిష్ఠ మద్దతు ధరను అందించాలని కోరారు. కొద్ది రోజులుగా ధాన్యం కొనుగోలు ధరకు సంబంధించిన రశీదులు చూపించాలని కోరినా మిల్లర్లు చూపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ బెజ్జం సాయి, రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.




ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రశాంతంగా రాస్తే

'పది'లో పది జీపీఏ

టెన్త్ విద్యార్థులకు టిప్స్
మోటివేషన్ స్పీకర్ సుదర్శన్



నిడమనూరు, మార్చి 17: విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మోటివేషన్ స్పీకర్ నూనె సుదర్శన్ అన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

- కొత్త విషయాలను పరీక్ష సమయంలో చదవకుండా, చదివిన విషయాలను మాత్రమే రివిజన్ చేసుకోవాలి.
- రివిజన్ చేసిన తర్వాత కళ్లు మూసుకుని మరోసారి మననం చేసుకోవాలి.
- పరీక్షల సమయంలో విద్యార్థులకు సరైన నిద్ర, మంచి ఆహారం తీసుకోవడం ముఖ్యం.
- జంక్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లవద్దు.
- క్రికెట్, కేబుల్ టీవీ, చాటింగ్, సినిమా, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి.
- సూర్యోదయం కంటే ముందే లేచి చదవుకోవడం వల్ల చాలా విషయాలు బాగా గుర్తుంటాయి.
- పరీక్షా హాల్లో చికాకు కలిగించే దుస్తులు ధరించవద్దు, సౌకర్యంగా ఉండే దుస్తులే వేసుకోవాలి.
- పరీక్షా కేంద్రానికి ఓ గంట ముందే వెళితే మంచిది.
- పరీక్షా హాల్లోకి అనుమతించిన వెంటనే వెళ్లి ప్రశాంతంగా కూర్చోవాలి.
- కళ్లు మూసుకుని పది నిమిషాలు ప్రశాంతంగా మెడిటేషన్ చేసుకోవాలి.
- ఇన్విజిలేటర్లు ఇచ్చిన సలహాలు,సూచనలు పాటించాలి.
- పరీక్షాహాల్లో ఇతరవిద్యార్థులతో సంభాషించకూడదు.
- మీకు వచ్చిన సమాధానాలు ముందుగా రాయాలి.
- తర్వాత కొద్దిగా ఆలోచిస్తే రాయగలిగే ప్రశ్నలకు సమాధానాలు రాయవచ్చు.
- చివరగా అన్ని ప్రశ్నలను పూర్తి చేసే విధంగా మీ జ్ఞానాన్ని ప్రదర్శించాలి.
- ఏ ఒక్క సమాధానాన్ని కూడా రాయకుండా వదిలేయకూడదు.
- పరీక్ష అయిపోయిన తర్వాత మరోసారి అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశారా లేదా అని ఓసారి చెక్ చేసుకోవాలి.
- పరీక్షఅయిపోయిన తర్వాత ట్రిపుల్‌ఆర్‌ను పాటించాలి
- పరీక్ష అయిపోగానే ఇంటికి వచ్చి కాసేపు విశ్రాంతి (రెస్ట్) తీసుకోవాలి. మళ్లీ (రీడ్) చదువుకోవాలి, చదివిన విషయాన్ని (విజన్) పునఃశ్చరణ చేసుకుని తర్వాతి పరీక్షకు సిద్ధం కావాలి. అన్ని పరీక్షలు అయిపోయేవరకు బయట తిరగకూడదు. పరీక్షలు పూర్తయ్యేవరకు ప్రతీ రోజు కొద్దిసేపు మెడిటేషన్, యోగా చేస్తూ ప్రశాంతంగా ఉండాలి. విద్యార్థులు పదో తరగతిలో కష్టంగా కాకుండా ఇష్టంగా పరీక్షలు రాసి పదికి పది జీపీఏ తెచ్చుకోవచ్చు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

నేరేడుచర్ల, మార్చి 17: నేటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు నేరేడచర్ల మండలంలో సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో ఛత్రునాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరేడుచర్లలో మూడు (జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ప్రగతి విద్యాలయం, శ్రీవాణి ఇంగ్లిషు మీడియం స్కూల్) పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 19ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 639మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 230, శ్రీవాణి స్కూల్‌లో 189, ప్రగతి విద్యాలయంలో 220మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

కోదాడ: పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఎంఈవో సలీంషరీఫ్ సూచించారు. ఆదివారం పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కోదాడ డివిజన్‌లో 17పరీక్షా కేంద్రాల్లో 3,285మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 1715మంది, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 1770మంది ఉన్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్ డెస్క్ నెం.994846789 ను సంప్రదించాలన్నారు.

చిలుకూరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో సలీంషరీఫ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 184మంది విద్యార్థులు, గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 220మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు.ఈ రెండు పరీక్షా కేంద్రాల సీఎస్‌లుగా కరుణాకర్‌రెడ్డి, తల్లాడ శ్రీనివాస్ విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు పరిశీలించారు.

మేళ్లచెర్వు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎంఈవో సైదానాయక్ తెలిపారు. ఉమ్మడి మండలంతో పాట కోదాడ మండలంలోని తొగరాయి, గణపవరం, యర్రారం, జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో 690మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు.

మఠంపల్లి: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో పానుగోతు ఛత్రునాయక్ తెలిపారు. మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చిన ప్రశ్నపత్రాలను, పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ, ఎన్‌సీఎల్, సెయింట్ ఆన్స్ పాఠశాలలకు చెందిన 468మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని మాన్‌ఫోర్డ్, సెయింట్ ఆన్స్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు.



కోదాడలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో సలీంషరీఫ్

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి: రాంకుమార్

సూర్యాపేట అర్బన్: నేటి నుంచి జరిగే పదో పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అక్షర ఫౌండేషన్, సుధాకర్ పీవీసీ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సాధనతో ఏదైనా సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పదో తరతగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉప్పు నాగయ్య, బత్తుల దామోదర్‌రెడ్డి, రుద్రంగి కాళిదాసు, శమంతకమణి, పుండరీకాచారి, వెంకటయ్య, ఫాతిమా, తిరుమలరెడ్డి పాల్గొన్నారు



సూర్యాపేటలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన రాంకుమార్‌రెడ్డి

బేతవోలు రామాలయంలో పూజలు



బేతవోలులో పూజలు చేయిస్తున్న హనుమంతరావు కుటుంబసభ్యులు

చిలుకూరు, మార్చి 17: దేవాదాయ కమిషనర్‌గా మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మంత్రి ప్రగడ హనుమంతరావు బాధ్యతలు స్వీకరించడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామంలోని సీతారామ చంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో హనుమంతరావు మాతృమూర్తి ప్రమీల, కుటుంబ సభ్యులు రమేష్, ప్రణవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముస్తఫా



ముస్తఫాకు నియామకపత్రం ఇస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 17: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ ముస్తఫాను నియమించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ముస్తాఫాకు నియామకపత్రాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన తండాల రోడ్లకు మహర్దశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు, మార్చి 17: కాంగ్రెస్ పాలనలో గిరిజన తండాల రోడ్లకు మహర్దశ పట్టనుందని ఎంపీపీ గోపాల్, జడ్పీటీసీ బుజ్జిమోతీలాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలకవీడు మండలంలో అనేక గ్రామాల రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రూ.6.50 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే మండలంలో రోడ్లు, కల్వర్టులు నిర్మిస్తామన్నారు. సమావేశంలో మోతీలాల్, ఉపేందర్, కవిత, నియమానాయక్, సైదానాయక్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని డీఎస్‌ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్తమ్ అంటేనే అభివృద్ధి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఏరియా ఆసుపత్రికి రూ.2.5కోట్ల విలువైన సిటీ స్కాన్ మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అశోక్, సుధాకర్, హరీష్, బెంజిమెన్, ఇస్సాక్, వీరబాబు పాల్గొన్నారు.

'కోడ్' ఎఫెక్టుతో పకడ్బందీగా తనిఖీలు



కోదాడ మండలం రామాపురంలో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో సూర్యనారాయణ

కోదాడ రూరల్, మార్చి 17: రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఆర్.సూర్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, మోతె మండలంలోని మామిళ్లగూడెం టోల్‌గేట్(సింగరేణి పల్లి) వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలను నిరంతరం ఆన్‌లో ఉంచాలన్నారు. నిఘా బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కోదాడ, మోతె తహసీల్దార్లు రవికుమార్, సంఘమిత్ర, ఆర్‌ఐలు మన్సూర్‌అలీ, అజయ్, కార్యదర్శి దేవేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కోదాడ మండలం కొమరబండ శివారులో కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

మద్దిరాల: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడిన సందర్భంగా జిల్లా సరిహద్దు ప్రాంతమైన మద్దిరాల మండలంలోని కుంటపల్లి గ్రామ శివారులో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు ఆదివారం తెలిపారు. చెక్ పోస్టు వద్ద వాహనాలను నిత్యం తనిఖీ చేస్తామన్నారు. నిబంధనల కంటే ఎక్కువ డబ్బు, మద్యం రవాణా చేస్తే, సరైన పత్రాలు చూపించాలన్నారు. లేనట్లయితే వాటిని సీజ్ చేస్తామన్నారు.

చిలుకూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు సూచించారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, జెండాలు, వాల్ రైటింగ్‌లను తొలగిస్తున్నామని, విగ్రహాలకు ముసుగులు వేస్తున్నామని తెలిపారు. వారి వెంట ఆర్‌ఐ సీతయ్య, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అనంతగిరి: ఎన్నికల నిబంధలను అందరూ పాటించాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకుండా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. గతంలో ఉన్నవాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని కోరారు.

కోదాడ రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండలంలోని కొమరబండ బైపాస్ వద్ద రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో డబ్బు, మద్యం, ఎన్నికల సంఘం నిషేధించిన వస్తువులను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి హెచ్చరించారు.

నూతన్‌కల్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో వాల్ రైటింగ్‌లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత సిబ్బంది పాల్గొన్నారు.



నూతన్‌కల్‌లో పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

దేవతామూర్తులకు వైభవంగా జలాభిషేకం

కోదాడ టౌన్, మార్చి 17: పట్టణంలోని శ్రీకోదండ రామాలయం పునర్నిర్మాణం సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవంలో భాగంగా రెండోరోజు ఆదివారం దేవతామూర్తులకు జలాదివాసాన్ని వైభవంగా నిర్వహించారు. సీత లక్ష్మణ సమేత శ్రీకోదండరాముడు, అన్నపూర్ణ సమేత బోళా లింగేశ్వరుడు, శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు తదితర దేవతామూర్తులను వేదపండితులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళా భక్తులు నూతన బిందెలతో జలాన్ని తీసుకుని పట్టణంలోని బొడ్రాయి నుంచి శోభాయాత్రగా రామ్మూర్తి నగర్‌లోని యాగశాల వద్దకు వచ్చారు. దేవతామూర్తులకు జలాదివాసాన్ని కనులపండుగగా నిర్వహించారు. వేద పండితుడు బొర్ర వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాగంలో 200మందికి పైగా దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైశ్రీరాం నినాదాలతో యాగశాల ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, రంగనాథ్, నందగోపాల్, అరవింద్ పాల్గొన్నారు.



దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు



దేవతామూర్తులకు జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

20న అన్నదాన ప్రసాద వితరణ

కోదాడలో కోదండ రామాలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని ఆరు ప్రాంతాల్లో ఈ నెల 20న అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతిష్ఠ నిర్వాహక కమిటీ సభ్యుడు పైడిమర్రి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ రోడ్డులోని టీడీడీ కల్యాణ మండపంలో, నయానగర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో, గుడిబండ రోడ్డులోని గుడిగుంట్ల అప్పయ్య ఫంక్షన్‌హాల్, శ్రీనివాసనగర్‌లోని కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో, కట్టకొమ్ముగూడెం రోడ్డులోని పెరిక హాస్టల్‌లో, నాగుబండి రామ్మూర్తినగర్‌లోని యాగశాల ప్రాంతంలో అన్నదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు వేదిక భవనానికి నెర్రలు

- *మూడేళ్లకే కుంగిన బేస్‌మెంట్ నిర్మాణం*
- *హుజూర్‌నగర్‌లో వినియోగంలోకి రాకముందే నిర్వీర్యం*

హుజూర్‌నగర్, మార్చి 17: పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద నిర్మించిన రైతువేదిక భవనానికి నెర్రలు వచ్చాయి. దీంతో రైతువేదిక పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.24 లక్షలతో ఈ రైతు వేదికను నిర్మించింది. నాణ్యత లేకుండా నిర్మించడంతో బేస్‌మెంట్‌తో పాటు భవనం తూర్పు భాగం కుంగింది. దాని చుట్టూ ఉన్న ప్లాట్‌ఫాం మొత్తం నెర్రలు బారింది.

ఈ రైతు వేదికను నిర్మించి మూడేళ్లు పూర్తయినా ఇప్పటివరకు రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ భవనం ఉండడంతో రైతులు ఆ వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో అధికారులు రైతు సమావేశాలు పట్టణంలోని ఏవో కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా కొత్తగా నిర్మించిన రైతు వేదికను ఎవరూ పట్టించుకోవడంలేదు. రైతువేదిక భవనం చుట్టూ బేస్‌మెంట్‌కు నెర్రలు రావడంతో కూలే పరిస్థితులు నెలకొన్నాయి. రైతు వేదిక భవనం చుట్టూ కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. భవనం తలుపులు చేతితో నెడితేనే ఊడిపోయే విధంగా ఉన్నాయి. భవనం లోపల దుమ్ము, ధూళి పేరుకుని పాడుబడిన బంగ్లాలా దర్శనమిస్తుంది.

అదనంగా బిల్లులు చేయించారని విమర్శలు..

రైతు వేదిక భవనాన్ని ప్రభుత్వం రూ.20 లక్షలతో నిర్మాణం ప్రారంభించగా, అదనంగా రూ.4లక్షలు బిల్లు చేయించారన్న విమర్శలు ఉన్నాయి. కాగా అవినీతి, అక్రమాలకు అలవాటుపడిన కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా రైతువేదిక భవనాన్ని నిర్మించారని, అప్పుడు అధికారంలో ఉన్న ఓ నేత బంధువే ఈ రైతు వేదిక భవనాన్ని నాసికరంగా నిర్మించారని విమర్శలు ఉన్నాయి.



హుజూర్‌నగర్‌లోని రైతు వేదిక భవనం, బేస్‌మెంట్‌లో వచ్చిన నెర్రలు(ఇన్‌సెట్లో)

- ఏడాది క్రితం ఈ భవనం తలుపులు ధ్వసం చేసిన లోపలికి ప్రవేశించిన దొంగలు తొమ్మిది ఫ్యాన్లు, ఇతర సామాగ్రి చోరీ చేశారు. ఆ సమయంలో పోలీసులకు వ్యవసాయ విస్తరణాధికారి ఫిర్యాదు చేసినా నేటి వరకు ఈ కేసులో పురోగతి లేదు.

సక్రమంగా నిర్మించకపోవడం వాస్తవమే

పట్టణంలోని ఫణిగిరి గట్టు వద్ద రైతువేదిక భవనాన్ని సక్రమంగా నిర్మించకపోవడం వాస్తవమే. భవనం చుట్టూ నెర్రలు వచ్చాయి. వాటర్ క్యూరింగ్ సరిగా చేయలేదు. తలుపులు కూడా సక్రమంగా లేవు.

● ప్రణయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి: సీపీఐ

నేరేడుచర్ల, మార్చి 17: రైతుల నుంచి మిల్లర్ల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు మిల్లర్లతో మాట్లాడి మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి, చిలకరాజు శ్రీను, కొమ్మరాజు వెంకట్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర దానం



పాండురంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మార్చి 17: పట్టణానికి చెందిన వ్యాపారి గరిణె పాండురంగయ్య ఆదివారం తెల్లవారుజామున బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి నేరేడుచర్ల వాసవీ, వనిత క్లబ్ సభ్యులు నివాళులర్పించి నేత్ర దానం చేయాలని కుటుంబ సభ్యులకు సూచించగా అంగీకరించారు. మిర్యాలగూడకు చెందిన డైమండ్ నేత్రాలయ వైదులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన పాండురంగయ్య భార్య ధనలక్ష్మి, కుమారులు వాసు, సతీష్, కుమార్తెలు, అల్లుళ్లకు ఆర్యవైశ్య సంఘం, వాసవి, వనిత క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు లింగయ్య రాజీనామా

ఆత్మకూర్(ఎస్), మార్చి 17: మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, టీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిడమర్తి లింగయ్య ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20ఏళ్ల నుంచి వివిధ హోదాల్లో బీఆర్ఎస్‌కు సేవలు అందించినట్లు తెలిపారు. పార్టీకి సమయం కేటాయించలేకపోతున్నందున వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచ శాంతికి పాలకులు కృషిచేయాలి

సూర్యాపేటఅర్బన్, మార్చి 17: ప్రపంచ శాంతికి పాలకులు కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కప్పల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన అఖిల భారత శాంతి సంఘీభావ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతసామరస్యం నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడాలన్నారు. చట్టసభల విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలని, ఆ దిశగా చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, కృష్ణ, గోపి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

నూతన్‌కల్, మార్చి 17: మండలంలోని వెంకేపల్లి గ్రామంలో ఉన్న ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారి కీర్తనను రెండో కేంద్రం టీచర్ అకారణంగా కొట్టిందని చిన్నారి తండ్రి పాల్వాయి పరశురాములు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకారణంగా కొట్టిన టీచర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్‌ను వివరణ కోరగా చిన్నారి నోట్లో వేలు వేసుకుంటే తీశానని, తాను ఎవరినీ కొట్టలేదన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నిక

కోదాడ, మార్చి 17: కోదాడ బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఏజెళ్ల రంగారావు తెలిపారు. ఆదివారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడనేజ ఈ నెల 19న నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, ఈ నెల 22న నామినేషన్ల ఉపసంహరణ, 28న పోలింగ్ ఉంటుందన్నారు. ఎన్నికలకు న్యాయవాదులు సహకరించి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు షేక్ జానీపాషా, ఆవుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, మార్చి 17: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామ శాస్త్రి, శేషగిరిరావు, రాజేష్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'

మఠంపల్లి, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ మండల కార్యదర్శి సయ్యద్‌రన్ మియా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో రవి, షైసయ్య, నాగయ్య, రహీం, అంజయ్య, తిరపతయ్య, వరమ్మ, నాగరాజు, శ్రీను, రాము, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆత్మకూర్(ఎస్), మార్చి 17: మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో తాటిచెట్టు నుంచి ప్రమాదవశాత్తు గీత కార్మికుడు యరగాని వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, తండ రమేష్, నోముల వెంకన్న, బెల్లంకొండ ఇస్తారి, కాట్ల వెంకన్న డిమాండ్ చేశారు.

'స్థానికులకే ఇన్‌చార్జి పదవి ఇవ్వాలి'

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 17: హుజూర్‌నగర్ బీఆర్ఎస్ నియోజకవర్గ పదవి స్థానికులకే కేటాయించాలని ఆ పార్టీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ముల్కలపల్లి రాంబాబుముదిరాజ్ కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమం నాటి నుండి పార్టీలో పనిచేసిన వారికి అవకాశం కల్పించాలన్నారు. కొత్తగా వచ్చిన వారికి, కండువాలు మార్చిన వారికి అవకాశం ఇస్తే మళ్లీ పదవుల కోసం పార్టీని మారతారన్నారు. సమావేశంలో పండు, రాము, సంపత్, దగడ గోపి, శివ, వెంకన్న పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

హుజూర్‌నగర్, మార్చి 17: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె.సుధాకర్ ప్రమాదవశాత్తు గాయపడి, అనారోగ్యం బారినపడటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోలపూడి యోహాన్ ఆధ్వర్యంలో సుధాకర్‌కు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు ఈ సందర్భంగా యోహాన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సైదులు, అశోక్, ప్రవీణ్, చందు, నిఖిల్, బాబు, విక్రమ్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అనంతగిరి, మార్చి 17: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాయిలసింగారం గ్రామశివారులో పేకాట స్థావరంపై తనిఖీ చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి రూ.3,030లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అనంతగిరి, మార్చి 17: మండలంలోని గోండ్రియాల గ్రామశివారులో ఇసుక టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి కోదాడకు ఇసుక తరలిస్తున్నట్లు ట్రాక్టర్‌ను గోండ్రియాల గ్రామ శివారులో పట్టుకుని సీజ్ చేశామన్నారు. డ్రైవర్ రాజేష్, టిప్పర్ యజమాని గోపీకృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.